మోదీ విజనరీ బడ్జెట్

(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి)

వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2025-26 కేంద్రం విజనరీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని బీజేపీ బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్‌గౌడ్ అన్నారు. విద్య, వైద్యం, పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసేలా అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. ఇది మోదీ 3.0 విజనరీ బడ్జెట్ అని పేర్కొన్నారు.



సామాన్యులను మెప్పించేలా..



కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రజలందరూ మెచ్చేలా ఉంది. రూ.12 లక్షల వరకు టాక్స్‌ఫ్రీ. పట్టణ పేదలకోసం యూపీఐ లింక్‌తో కూడిన క్రెడిట్ కార్డులు అందించడం ఎంతో మేలు. అన్ని రంగాలకు ప్రోత్సాహకాలు అందించారు. విద్య, వైద్యం, అన్ని పారిశ్రామిక రంగాలవారిని మెప్పించేలా ఉంది.

-కే.మహేందర్, బీజేపీ మూసాపేట కార్పొరేటర్

మధ్యతరగతి వారికి మేలు



ఆశావహ మధ్య తరగతికి ఈ బడ్జెట్ ఓ 'ప్రామిసింగ్ బడ్జెట్'. ఈ బడ్జెట్‌లో వినియోగదారుల సామర్థ్యాన్ని నడిపించగల చోదకశక్తి ఉంది. తదనుగుణంగా భారత ఆర్థిక వ్యవస్థ ఎదుగుదల సుస్పష్టంగా కనపడుతోంది. మధ్య తరగతికి ప్రోత్సాహకాల ద్వారా వినియోగం పెరగడంతో విపణిలో డిమాండ్ తద్వారా ప్రభుత్వ రెవెన్యూ వృద్ధి చెందుతుంది. మొత్తం మీద ఆర్థిక వ్యవస్థ బలపడనుంది.

- ప్రొ.(డా) భరత్ భూషణ్‌సింగ్, డైరెక్టర్ వీజేఐఎం, హైదరాబాద్

ఫర్వాలేదు



ఉద్యోగులకు, మధ్య తరగతి వారికి మేలు చేసే విధంగానే బడ్జెట్ రూపొందించారు. వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా మరిన్ని ప్రోత్సాహకాలు ఇస్తే బాగుండేది. మొత్తం మీద ఈసారి బడ్జెల్ ఫర్వాలేదు అని పించేలా ఉంది. పన్ను రాయితీ మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

- శంకర్, కూకట్‌పల్లి, సాయిబాబానగర్‌కాలని అధ్యక్షుడు

జేఎన్‌టీయూలో 'ఆర్ అండ్ డీ సెల్' ఏర్పాటు

● సమన్వయకర్తగా డాక్టర్ శిల్పచక్ర నియామకం



డాక్టర్ శిల్పచక్ర

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీలో నూతనంగా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్‌ను ఏర్పాటు చేస్తూ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ నర్సింహారెడ్డి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రతీ అటానమస్ కళాశాల సొంతంగా ఆర్ అండ్ డీ విభాగాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఇటీవల యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆదేశాలిచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, ఆర్ అండ్ డీ సెల్‌కు సమన్వయకర్తగా నానోసైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శిల్పచక్రను నియమించారు. క్యాంపస్ కళాశాలలోని వివిధ విభాగాల్లో జరుగుతున్న పరిశోధనలను సమన్వయం చేయడం, పీహెచ్‌డీ స్కాలర్స్‌కు అవసరమైన సలహాలు, సూచనలను అందించే లక్ష్యంతో ఈ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అలాగే, పలు విభాగాల సహకారంతో మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్‌కు అధిక ప్రాముఖ్యతను ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు.

నేడు ప్రగతినగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు

కూకట్‌పల్లి/మూసాపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్ ప్రగతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఫిబ్రవరి 2న నిర్వహిస్తున్నట్లు కాల నీవాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు ప్యానల్‌లు పోటీ పడుతున్నాయని, ప్రగతినగర్‌లో సుమారు 375 వరకు ఓట్లు ఉన్నాయని, మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని సాయికిరణ్ తెలిపారు



స్కాలర్‌షిప్ అందజేసే కార్యక్రమంలో సోమయాజులు తదితరులు

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేత

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): చదువుకు పేదరికం అడ్డు కాకూడదని వనవాసి కల్యాణ్ పరిషత్ అధ్యక్షుడు సోమయాజులు అన్నారు. ఈ మేరకు సింగిల్ పేరెంట్ ఉన్న పేద చిన్నారులకు భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఒక్కో విద్యార్థికి రూ.7 వేల చొప్పున స్కాలర్‌షిప్స్ అందజేశారు. ఈ మేరకు పీఎస్‌ఎం హైస్కూల్‌లోని ఇందిర చంద్రశేఖర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మూసాపేట్ పరిసర ప్రాంతాల్లోని 75 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేసినట్లు నిర్వాహకులు అశ్విని సుబ్బారావు, హనుమంతరావు శనివారం తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన పిల్లలను గుర్తించి, చదువులో వెనకడుగు వేయకుండా ఉండేందుకు ప్రోత్సాహం ఇచ్చామని పేర్కొన్నారు. పేద విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో సాధన నరసింహాచారి, సృజనప్రభ, పసుపులేటి నరేంద్రకృష్ణ, బీఎస్‌ఎన్ మూర్తి, సీహెచ్ అనిల్‌కుమార్, పంచశీల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.11, వంకాయ రూ.23, బెండకాయ రూ.40, పచ్చిమిర్చి రూ.35, బజ్జిమిర్చి రూ.28, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.13, బీన్స్ రూ.40, క్యారెట్ రూ.20, గోబిపువ్వు రూ.30, దొండకాయ రూ.35, చిక్కుడు కాయ రూ.35, గోరుచిక్కుడు రూ.28, బీట్‌రూట్ రూ.20, క్యాప్సికం రూ.35, ఆలుగడ్డ రూ.23, కీర రూ.23, దోసకాయ రూ.18, సొరకాయ రూ.20, పొట్లకాయ రూ.20, కంద రూ.65, ఉల్లిపొరక రూ.40, ఉల్లిగడ్డ రూ.34, మామిడికాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.40, ముల్లంగి రూ.4-5, చిలగడదుంప రూ.35, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.30-40, మునగకాయలు రూ.10-12, పచ్చిబఠాణి రూ.45, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండుమిర్చి రూ.200, అల్లం రూ.80, వెల్లుల్లి రూ.200, చింతపండు రూ.140, పండుమిర్చి రూ.80, ఉసిరి రూ.50, కరివేపాకు రూ.100, పర్వల్ రూ.55, పల్లికాయ రూ.70, లోబా రూ.25, ఆ కాకరకాయ రూ.60. పైన పేర్కొన్న ధరలు ఈ రోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

కబ్రస్తాన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



అల్లాపూర్‌లోని కబ్రస్తాన్‌ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబీహబేగం

అల్లాపూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌కు సంబంధించిన పలు శ్మశానవాటికలు, కబ్రస్తాన్‌లు, క్రిస్టియన్ గ్రేవ్‌యార్డులను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబీహబేగంతో కలిసి శనివారం పరిశీలించారు. గురువారం పలువురు ముస్లిం నేతలు, మసీదు కమిటీ ప్రతినిధులు అల్లాపూర్ డివిజన్‌లోని కబ్రస్తాన్‌లలో నెలకొన్న సమస్యలపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో భేటీ అయిన విషయం విదితమే. శనివారపు పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే ముందుగా పర్వత్‌నగర్ శ్మశానవాటిక, కబ్రస్తాన్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన న్యూ రామారావునగర్, పండిత్ నెహ్రూనగర్, రాజీవ్‌గాంధీ నగర్‌లోని శ్మశానవాటికల్లోని సమస్యలపై విన్నవించారు. ఆయా స్థలాల్లో అంత్యక్రియల సమయంలో మృతుల బంధువులకు నీటి ఏర్పాటు, రాత్రి వేళల్లో జరిగే కార్యక్రమాల కోసం విద్యుద్దీపాల ఏర్పాటు, కొన్ని చోట్ల బోరుబావులను ఏర్పాటు చేయాలంటూ అధికారులకు సూచించారు. పర్యటనల్లో జీహెచ్‌ఎంసీ అధికారులు ఏఈ రంజిత్, లింగాల ఐలయ్య, నాగుల సత్యం, వీరారెడ్డి, జాహెద్ షరీఫ్, జ్ఞానేశ్వర్, టీఆర్‌ఎస్ రాజు, బ్రహ్మ, రియాజ్, రాంబాబు, మల్లేష్, సయ్యద్ నజీర్, మోయిన్, అబ్దుల్ హమీద్, చాంద్, సలాఉద్దీన్, ఇస్మైల్, స్వామి పాస్టర్, కళ్యాణ్, విష్ణు పాల్గొన్నారు.



లక్షడప్పులు..కోటిగొంతులు కార్యక్రమంలో పాల్గొన్న కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్‌తో నాయకులు

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ అనుకూలమే..

కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి/ మూసాపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీలకు అండగానే ఉందని, ఎస్సీ వర్గీకరణ అమలుకు కట్టుబడి ఉన్నామనీ కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ తెలిపారు. శనివారం మూసాపేట డివిజన్ గూడ్స్‌షెడ్ రోడ్‌లో 'లక్ష డప్పులు.. కోటి గొంతుకలు' కార్యక్రమానికి హాజరై సంఘీబావం ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నారని తెలిపారు. ఈనెల 7న నగరంలో నిర్వహిస్తున్న లక్ష డప్పులు.. కోటి గొంతుకల కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కోసం కాంగ్రెస్ కార్యకర్తల కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నాగిరెడ్డి, తూము వేణు, మాజీ వైస్‌ఛైర్మన్ లక్ష్మయ్య, రఘు, చున్నుపాష, సంతోష్, మోసిన్, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరో ఫేజ్‌లో పార్కు ప్రహరీ ఎత్తు పెంపునకు చర్యలు తీసుకోండి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తున్నామని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు కేపీహెచ్‌బీ ఆరోఫేజ్, భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-2లో కార్పొరేటర్ శనివారం పర్యటించారు. ఆయా కాలనీల్లోని అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరోఫేజ్‌లోని పీవీఎన్‌ఆర్ పార్కు ప్రహరీ ఎత్తు పెంచాలని విజ్ఞప్తి చేయగా.. వెంటనే ఇంజనీరింగ్ ఏఈ సాయిప్రసాద్‌కు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ ఆదేశాలు జారీ చేశారు. భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-2లో భూగర్భ డ్రైనేజీ, దోమలు సమస్య ఉందని చెప్పడంతో జలమండలి వర్క్‌ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌కు త్వరితగతిన సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా అసోసియేషన్ల సభ్యులు కృషి చేయాలన్నారు. కాలనీల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో నారాయణ రాజు, ఎంఎస్ రావు, జీఎం రావు, సాంబశివారెడ్డి, రవీందర్‌రెడ్డి, ఈశ్వర్, హరిప్రసాద్, రామస్వామి, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వార్డుకో అధికారి

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల దరఖాస్తులో ఏమైనా సమస్యలుంటే ప్రజలు ఇబ్బందులు పడొద్దని, ప్రజలకు సాయం చేసేందుకు వార్డుకో అధికారిని నియమించేందుకు జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్స్ డిప్యూటీ కమిషనర్లు బండి గంగాధర్, భారతి వంశీకృష్ణ ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు ఉపక్రమించారు. ఇటీవల వార్డుకో కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించగా.. తాజాగా జీహెచ్‌ఎంసీ వార్డుకు ఒక అధికారిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులతో పాటు ప్రజాపాలనలో ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారిని సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కొత్త దరఖాస్తులతో పాటు గతంలో దరఖాస్తు, సర్వే గురించి సూచనలు, సలహాలు కూడా స్వీకరించనున్నారు.

● మూసాపేట్ సర్కిల్..

కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ (114): వి.శ్రీనివాస్ - 9849906745, బాలాజీ నగర్ డివిజన్(115): టీకే ప్రభాకర్- 98499 07651, అల్లాపూర్ డివిజన్ (116):బి.కార్తీక్ - 91542 95227, మూసాపేట్ డివిజన్(118): కేఎస్ మెహ్రా-99499 94053, ఫతేనగర్ డివిజన్(118): కె.మురళి - 9000554761.

● కూకట్‌పల్లి సర్కిల్..

ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ (119): పి.సుదర్శన్‌కుమార్- 9959442437, బాలానగర్ డివిజన్ (120): సునీల్- 73311 70683, కూకట్‌పల్లి డివిజన్ (121): సాయిప్రసన్న- 79950 07398, వివేకానందనగర్ డివిజన్(122): వాహీద్ అలీ- 9849639766, హైదర్‌నగర్ డివిజన్ (123): సందేష్ చాంద్ శ్రీవాత్సవ్-9849908068, ఆల్విన్‌కాలనీ డివిజన్(124): కె.శ్రీనివాస్- 9989930181.

నేడు అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని పీఎస్‌ఎం స్కూల్‌లో ఆదివారం విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఈవో హరిచరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు డా.మధు వారణాసి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు.

రాణాప్రతాప్‌నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు నేడు

అల్లాపూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాణాప్రతాప్‌నగర్ సంక్షేమ సంఘానికి ఆదివారం ఎన్నికలు నిర్వహించనున్నట్లు సంఘం మాజీ అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే నామినేషన్ ప్రక్రియ, ఉపసంహరణ గడువు ముగియగా ఇద్దరు అభ్యర్థులు బరిలో ఉన్నారని తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘంలో 215 మంది సభ్యులున్నారని, ఉదయం 8 నుంచి సాయంత్రం 3 వరకు పోలింగ్ జరుగుతుందని, సాయంత్రం 5 గంటలకు ఫలితాలు వెలువడుతాయని వివరించారు.

శేరిలింగంపల్లి కాంగ్రెస్ బ్లాక్ రెసిడెన్స్ నియామకం

హైదర్‌నగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మొగిలి సునీతారావు ఆదేశాలతో రంగారెడ్డిజిల్లా అధ్యక్షురాలు జ్యోతి, శేరిలింగంపల్లి అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ బ్లాక్ రెసిడెన్స్, నియోజకవర్గ కోర్ కమిటీ సభ్యులను నియమించి నియామక పత్రాలు అందజేశారు. బ్లాక్ రెసిడెన్స్ శ్రీదేవి భాగ్యలక్ష్మి, కోర్ కమిటీ సభ్యులు తస్వీర్ జయకృష్ణకుమారి, భవాని, జ్యోతితో పాటు 13మంది కార్యనిర్వాహక సభ్యులు, 11మంది డివిజన్ అధ్యక్షురాలను నియమించారు. ఈమేరకు గాంధీభవన్‌లో నియామక పత్రాలు అందజేశారు.

'బసవతారకం ఆస్పత్రి సేవలు ఎనలేనివి'

ఖైల్‌కాలనీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ కేన్సర్ రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలందిస్తున్న నందమూరి బాలకృష్ణకు భారత ప్రభుత్వం పద్మభూషన్ అందించడం అభినందనీయమని నందమూరి తారక రామారావు అభిమాన సంఘం అధ్యక్షుడు బీకే యాదయ్య పేర్కొన్నారు. పద్మభూషన్ అందిచడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీహెచ్‌ఈఎల్ పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కేన్సర్ రోగులకు బసవతారకం ఆస్పత్రి అందించిన సేవలు ఎనలేనివన్నారు. నందమూరి బాలకృష్ణకు భారత ప్రభుత్వం పమ్మభూషన్‌లో సత్కరించడం అందించిన సేవలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సభ్యులు నాగేష్, నర్సింలు, బీరప్ప, శివరాజ్, శ్రీకాంత్, రాజు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బోధనతోనే.. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- స్వయం ఔట్‌రీచ్ వర్క్‌షాప్ నోడల్ అధికారి వైభవ్ విందాల్
- 'యూజీసీ-స్వయం కోర్సుల అమలు-విద్యా సాధికారత' అంశంపై హెచ్‌సీయూలో వర్క్‌షాప్



జాతీయ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వీసీ బీజేరావు, ఐఐటీ, ఐఐఎంల ఆచార్యులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు ఆన్‌లైన్ బోధనతోనే సాధ్యమని యూజీసీ-స్వయం ఔట్‌రీచ్ వర్క్‌షాప్ నోడల్ అధికారి ప్రొఫెసర్ వైభవ్ విందాల్ అన్నారు. 'స్వయం కోర్సుల అమలు-సాధికార విద్య' అంశంపై శనివారం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో జరిగిన జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ.. విద్య వల్ల భవిష్యత్తు గురించి చర్చించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ బీజే రావు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్యావేత్తలదే కీలకపాత్ర అని, దేశం పగ్గాలను మీ చేతుల్లోనే ఉంచుకోండని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో విశ్వవిద్యాలయాల ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. యూజీసీ సంయుక్త కార్యదర్శి దీక్షా రాజ్‌పుత్ మాట్లాడుతూ.. విద్యా సంస్థలు తమ విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా కోర్సులను ఎంచుకోవడానికి అనుమతించాలన్నారు. ఓ విద్యార్థి ఒక సెమిస్టర్‌లో గరిష్ఠంగా 40శాతం క్రెడిట్లను పొందవచ్చన్నారు.

ఏఐ, డేటా టెక్నాలజీ కోర్సులకు ప్రాధాన్యం

ఐఐటీ మద్రాస్‌లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఆర్.సారథి మాట్లాడుతూ.. స్వయంలో ఏ కోర్సు కూడా ఒక నిర్దిష్ట రంగానికి పరిమితం కాదని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులతో పాటు డేటా క్యూరేషన్, డేటా టెక్నాలజీ కోర్సులకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఐఐటీ మద్రాస్ నిర్వహించే కోర్సులను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో స్వయం ప్లస్ ద్వారా అందిస్తున్నామన్నారు. ఐఐటీ మద్రాస్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జయకృష్ణన్ మాట్లాడుతూ.. అధ్యాపకుల కొరత కారణంగా విద్యార్థులకు పలు రకాల కోర్సులను అందించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న టైర్ 2, టైర్ 3 కళాశాలలకు స్వయంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఆయా కళాశాలల్లో అనేక కోర్సులను బోధించడానికి తగిన సంఖ్యలో ప్రొఫెసర్లు లేరని, అటువంటి కాలేజీ విద్యార్థులకు స్వయం ఎంతో ఉపకరిస్తుందన్నారు.

'స్వయం'లో ఐఐఎం నుంచి 95 కోర్సులు

బెంగళూరు ఐఐఎం డిజిటల్ లెర్నింగ్ విభాగం చైర్‌పర్సన్ వాసంతి శ్రీనివాసన్ మాట్లాడుతూ.. ఐఐఎం బెంగళూరు నుంచి 95కోర్సులను సిద్ధం చేశామన్నారు. నాణ్యమైన డిజిటల్ కంటెంట్‌ను అందించేందుకు ఐఐఎం బెంగళూరు నిరంతరం కృషి చేస్తోందన్నారు. అలాగే, కళాశాలల్లో అధ్యాపకుల బోధనా సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలకు కూడా ప్రాముఖ్యత ఇస్తున్నామన్నారు. విద్యా సంస్థలు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ను ప్రోత్సహించడం ద్వారా విద్యలో నాణ్యత మెరుగువుతుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, అండమాన్, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని యూనివర్సిటీలు, అనుబంధ కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై పలువురి స్పందన

పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన. ఈ బడ్జెట్ కొన్ని రంగాలకు ప్రాధాన్యం, మరికొన్ని రంగాలను నిర్వీర్యం చేసేలా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.
- చందానగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి)

వేతన జీవులకు ఊరట నిచ్చే బడ్జెట్



పేద, మధ్య తరగతి ప్రజల భారాన్ని తగ్గించేందుకు ఆదాయపు పన్ను వెసలుబాటును ఆహ్వానించదగినది. వ్యవసాయ రుణాలు, చిన్న సూక్ష్మ మధ్యతరగతి పరిశ్రమలకు రుణ సదుపాయం కల్పించడం మంచి పరిణామం. ప్రత్యామ్నయ ఇందన వనరులకు సూర్యగ్రహరి ప్రయోజనం లాంటి సహాయం అందించడంతో సామాన్య కుటుంబాలు విద్యుత్ వినియోగాన్ని గరిష్ఠంగా ఉపయోగించుకోవడానికి, దీర్ఘకాలిక ప్రయోజనం పొందడానికి అస్కారం ఉంది.
- క్రిష్ణారెడ్డి, అర్థిక శాస్త్ర ఆచార్యులు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

మధ్యతరగతికి భారీ ఊరట



మధ్యతరగతి వేతనం పొందే ఉద్యోగులకు ఆదాయం పన్ను పరిమితిని రూ:12లక్షల వరకు పెంచడం వల్ల ప్రయోజనం పొందుతారు. స్టాండర్డ్ డియేషన్ రూ.75 వేలు కలుపుకొని రూ.12లక్షల 75వేలు వరకు ఆదాయపు పన్ను మధ్యతరగతి ఉద్యోగులకు చాలా ఉపయోకరంగా ఉంటుంది. అద్దె,పెన్షన్ ఆదాయంను రూ. 6లక్షల వరకు పెంచారు. కిసాన్ క్రెడిట్ కార్డులపై రూ. 5లక్షల వరకు రుణాలు పొందే సదుపాయం కల్పించింది. ఈ బడ్జెట్ బాగుందనే చేప్పవచ్చు.
- మురళీకృష్ణ అసిస్టెంట్ ప్రొఫెసర్ అఫ్ ఎకనామిక్స్, బేల్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాల

మందుల ధరలు తగ్గిండం హర్షణీయం



బడ్జెట్‌లో కొని దీర్ఘకాలిక మందుల ధరలను తగ్గిండంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగేలా ఉంది. వైద్యరంగానికి ఉపయోగకరంగా ఉంది. ప్రైవేట్ అస్పత్రుల్లో చార్జీలను నియంత్రించేలా ఒక ప్రమాణికత లేదు. ప్రభుత్వమే ఫీజుల నియంత్రణ చేసేలా ఉంటే బాగుండేది.
- డాక్టర్,కెప్టెన్ రవీంద్రకుమార్, హెచ్‌సీయూ హెల్త్‌సెంటర్ సూపరిండెంట్

బీమా రంగాన్ని ప్రైవేట్ పరం చేసేలా..



బీమా రంగంలోకి ప్రైవేట్ భాగాస్వామం కల్పించడం సామజానికి మంచి పరిణామం కాదు. ఈ రంగాన్ని ప్రైవేట్ రంగంవైపు నడిపించేలా పునాదులు పడినట్టుంది. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. ఎలక్ట్రిక్ వస్తువుల ఉత్పత్తి రంగాలకు ప్రాధాన్యం, ప్రోత్సాహకాలు ఇవ్వడం మంచి పరిణామం.
- తాడిబోయిన రామస్వామి యాదవ్, సామాజిక కార్యకర్త

దూర దృష్టితో కేంద్ర బడ్జెట్

'హీల్ ఇన్ ఇండియా' కార్యక్రమం ద్వారా గ్లోబల్ మెడికల్ టూరిజంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపారు. దూరదృష్టితో ఉన్న కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం.. అభినందిస్తున్నాం. ప్రైవేట్ సెక్టార్‌తో సహకార ప్రయత్నం వల్ల ఆర్థిక వ్యవస్థను పెంచడంతో పాటు రోగులకు ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తుంది. కెపాసిటీ బిల్డింగ్, స్ట్రీమ్‌లైన్డ్ వీసా నిబంధనలు, ప్రయాణ సౌలభ్యంపై వ్యూహాత్మక ప్రాధాన్యం, వైద్య పర్యాటకం విస్తారమైన సామర్థ్యాన్ని సులభతరం చేస్తుంది. వృద్ధికి కొత్త మార్గాలను సృష్టిస్తుంది. ఈ చొరవ వల్ల ఆరోగ్య సంరక్షణ నిపుణులు, ఆస్పత్రులు, సంబంధిత పరిశ్రమలకు అవకాశాలను పెంపొందిస్తుంది. తద్వారా ఉపాధి, ఆర్థిక వృద్ధిని ప్రేరేపిస్తుంది. ఆర్థిక మంత్రి ఆచరణాత్మకమైన, ముందుచూపుతో దేశ ఆరోగ్య సంరక్షణ రంగాన్ని అపూర్వమైన ఎత్తులకు పెంచి, ప్రపంచ ఆరోగ్య సంరక్షణ పటంలో స్థానాన్ని సుస్థిరం చేస్తుంది.
- డాక్టర్ గాయత్రి కామినేని, సీఈఓ కామినేని ఆస్పత్రి

ఆలయ శిఖర మహా కుంభాభిషేకం

ఖైల్‌కాలనీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆలయ శిఖర మహా కుంభాభిషేకం, పూర్ణాహుతితో పెద్దమ్మతల్లి ఆలయ ధ్వజస్థంభ ద్వాద శ ప్రతిష్టాపన మహోత్సవాలు ముగిశాయి. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని పెద్దమ్మతల్లి ఆలయంలో ధ్వజస్థంభాన్ని ప్రతిష్ఠించి 12 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా రెండురోజుల పాటు ద్వాదశ ప్రతిష్టాపన మహోత్సవాలు నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా శనివారం యాగశాలలో ఖైల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కె.భరణీధర్ రాజా, శ్రీనివాస్‌రావు దంపతులు పూర్ణాహుతిలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు మాధవరావు, కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి విశ్వనాథం, కార్యవర్గ సభ్యులు, పలు విభాగాల జనరల్ మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

'వరదనీటి కాల్వ పనులు పూర్తి చేయాలి'

హైదర్‌నగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ సెవెన్‌హిల్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి ఊరేగింపునకు నిజాంప్‌రోడ్డు వద్ద జరుగుతున్న వరదనీటి కాల్వ పనులు అడ్డు లేకుండా చూడాలని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. శనివారం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ ఏఈ రాజీవ్‌తో కలిసి వరదనీటి కాల్వ పనులను పరిశీలించారు. స్వామివారి ఊరేగింపునకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఈఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్‌ఎన్‌రెడ్డి గార్డెన్‌లో కళాశాల ప్రజ్ఞ ఉత్సవ్

చందానగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): చందానగర్‌లోని ఎస్‌ఎన్‌రెడ్డి గార్డెన్‌లో కళాశాల ప్రజ్ఞ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చందానగర్ ప్రజ్ఞ డిగ్రీ, పీజీ కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, కో-ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఖైల్‌కాలనీ: బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం, షిరిడీసాయి వ్రతం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ముందుగా భక్తులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

చందానగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా కంచర్‌కూర్ గ్రామానికి చెందిన ప్రసాద్(35)శనివారం తెల్లవారుజామున లింగంపల్లి -చందానగర్ రైల్వే స్టేషన్‌మధ్య రైలు ప్రమాదానికి గురై మృతి చెందాడు. 20 సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి శేరిలింగంపల్లి సందయ్యనగర్‌లో మేస్త్రీ పని చేసుకుంటూ భార్యా ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నారు. మృతుడు మూడు రోజుల క్రితం సొంత గ్రామానికి వెళ్లాడు. మృతుడి షర్ట్ ప్యాకేటులో రాజేంపేట-లింగంపల్లి రైలు టికెట్ ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాని ఉస్మానియా అస్పత్రికి తరిలించినట్టు తెలిపారు.

రేగుల కుంట చెరువులో యూజీడీ పనులు

మియాపూర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మియాపూర్ దీప్తిశ్రీనగర్ కాలనీలోని రేగులకుంట చెరువు సుందరీకరణలో భాగంగా రూ.60లక్షలతో చేపట్టనున్న మురుగునీరు మళ్లింపు(యూజీడీ) పైపు లైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డితో కలిసి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పరిశీలించారు. యూజీడీ నిర్మాణ పనుల వల్ల శాశ్వత పరిష్కారం దిశగా చెరువును అభివృద్ధి చేస్తున్నామన్నారు. పరిసర కాలనీల వాసులు వాకింగ్, చక్కటి వాతావరణంలో సేద తీరవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకలు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, సందీప్‌రెడ్డి, కాలనీల వాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి అభాగ్యులకు వరం

హైదర్‌నగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్‌కు చెందిన గంగాధరరావు అత్యవసర వైద్యచికిత్స బిల్లుల కోసం సీఎం రిలీఫ్‌ఫండకు దరఖాస్తు చేసుకున్నాడు. మంజూరైన రూ.2.50లక్షల మంజూరి పత్రాలను శనివారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విమల, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వస్త్రాలు పంపిణీ

హైదర్‌నగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్‌లోని చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాఘబంధు కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బస్తీలోని అనాధలకు, దివ్యాంగులకు, వృద్ధులకు కావాల్సిన వస్త్రాలను అందించటం జరిగింది. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి అప్పాజి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ మానవసేవే మాధవసేవన్నారు. ఈరోజు నగరంలో 60ప్రదేశాలలో కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు.

అపర్ణ సరోవర్‌లో ఘనంగా పల్లెజాతర


అపర్ణ సరోవర్‌లో పల్లె జాతరలో స్థానికులు

గచ్చిబౌలి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నల్లగండ్ల అపర్ణసరోవర్‌లో ప్రభల తీర్థం పట్నంలో పల్లె జాతర రెండో రోజు శనివారం కొనసాగింది. ప్రజలు, స్థానికులు, కమ్యూనిటీ వాసులు వందలాది మంది ఈ పోటీల్లో పాలు పంచుకున్నారు. ప్రత్యేకంగా కార్యక్రమంలో తుర్పు గోదావరి జిల్లా వాసులు పాల్గొని నాగులు ప్రభలను తయారు చేశారు. ఆదివారంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. మహిళలు సామూహికంగా సూర్యశివరాధన మధ్య పాయసం తయారు చేసి భక్తులకు వడ్డించారు. పరమశివుడి పల్లెజాతరలో భాగంగా ఆలయాన్ని శివాలింగం ఆకారంలో తయారు చేశారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు అపర్ణసరోవర్‌లో ప్రభల ఊరేగింపు నిర్వహించనున్నారు. మహిళలే ప్రభలను మోస్తారు.







ఒకే రకం టీ షర్టులు ధరించి ఐక్యత ప్రదర్శించిన పోలీసులు

ఒకే టీం నినాదంతో ముందుకు సాగుతున్న పోలీసులు

జీడిమెట్ల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మేమంతా ఒకే టీం అనే నినాదంతో జీడిమెట్ల పోలీసులు ముందుకు సాగుతున్నారు. ఎలాంటి కేసునైనా సమర్థవంతంగా, సమన్వయంతో ఛేదిస్తూ, శాంతి భద్రతలను కాపాడతామని అంటున్నారు. ప్రజలకు మంచి పోలీసింగ్‌ను అందిస్తూ ఒకే టీంగా ముందుకు వెళతామని తెలియచేస్తూ శనివారం టీం మొత్తం టీ షర్టులు ధరించి ప్రజలకు ధైర్యం నింపారు. టీంలో స్ఫూర్తిని నింపడానికి ఈ కార్యక్రమం చేపట్టామని జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాల జాతరకు ఆహ్వానం

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, షాపూర్‌నగర్‌లోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల జాతరకు శనివారం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కి ఆహ్వానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన బ్రహ్మోత్సవాల జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షులు ఠాకూర్ రాజేందర్ సింగ్, లక్ష్మణ్, పి. బలరామ్, శ్రీరాముగౌడ్‌లు పాల్గొన్నారు.

గత బడ్జెట్ కంటే భేష్

కేంద్ర బడ్జెట్‌పై ఉద్యోగుల స్పందన



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మధ్యతరగతి, సామాన్యులకు మేలు చేసేలా ఉన్నా అవి కార్యరూపం దాల్చడం ఎప్పటికి సాధ్యమవుతుందనేది పేర్కొనలేకపోవడంపై నగర వాసులు పెదవి విరుస్తున్నారు. నిత్యావసర వస్తువుల పెరుగుదల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఆదాయపు పన్ను 12 లక్షలకు పరిమితం చేయడం ఊరటనిచ్చే అంశం. రైతులకు మేలు చేసేలా బడ్జెట్ ఉన్నట్టు కొందరు అభిప్రాయపడుతున్నారు.

- జోన్‌బృందం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి)

పలు అంశాలను విస్మరించారు



నిత్యావసరాల ధరలు, నూతన ఉద్యోగాల కల్పన, రైతు సంఘాలు సూచించిన పంటకు కనీస మద్దతుధర బడ్జెట్‌లో లేకపోవడం బాధాకరం. గత బడ్జెట్‌లో ప్రకటించిన బయ్యారం ఉక్కు, గిరిజన విశ్వవిద్యాలయాల స్థాపన నూతనంగా ఏర్పడిన జిల్లాల్లో జవహర్ నవోదయ, గురుకులాలు అంశాలను ఈ బడ్జెట్‌లో పేర్కొనలేదు. కేవలం ఇన్‌కమ్ ట్యాక్స్ రద్దు అని చెప్పుకోవడం తప్ప సామాన్యులకు ఉపయోగం లేదు.

- ఉమా మహేష్, సీపీఐ నాయకుడు

పారిశ్రామిక రంగానికి ఊతం



కేంద్రమంత్రి సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సెక్టార్ కంటే కామన్ బడ్జెట్‌లా ఉంది. పారిశ్రామిక రంగానికి ఈ బడ్జెట్ కొంతమేర ఊరటనిస్తుంది. వికసిత్ భారత్ అభివృద్ధిలో భారతదేశం ఈ బడ్జెట్‌లో అభివృద్ధి చెందుతుంది. బడ్జెట్ 2023-24లో ప్రవేశపెట్టిన బడ్జెట్ కంటే ఈ బడ్జెట్ బాగుంది.

- పి.స్వామిగౌడ్, ఇండస్ట్రియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, గాంధీనగర్

ఉద్యోగులకు కొంత ఊరట



కేంద్రం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో ఉద్యోగులకు ఆదాయంలో కొంత ఊరట కలిగించారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు ఎంఎస్ఎంఈ ద్వారా రూ.10కోట్ల వరకు తనఖా లేని రుణాలు అందిస్తోంది. కానీ బ్యాంకులు అనేకరకాల షరతులు విధించి రుణాలను చేయడం లేదు. బ్యాంకింగ్‌కు తగిన షరతులు విధిస్తేనే పరిశ్రమ స్థాపనకు యువత ముందుకు వస్తుంది. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు వస్తువు తయారు చేసి పంపినా మూడు నెలలకు గాని బిల్లులు అందడంలేదు. కానీ ఒక నెలలోపు జీఎస్టీ చెల్లించకుంటే అపరాధ రుసుము పడుతోంది. కేంద్రం పునరాలోచన చేసి చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలను ఆదుకోవాలి.

- వి.రామ్‌రెడ్డి, మానస టూల్స్‌టెక్ పరిశ్రమ అధినేత

కొంత ఆశాజనకం



బడ్జెట్‌లో పేద, మధ్యతరగతికి పెద్దగా స్థానం దక్కలేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త హంగులు, ప్రభుత్వ పాఠశాలల్లో 50వేల అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలలకు ఇంటర్నెట్ సేవలు, భారతీయ భాష పుస్తకాలకు డిజిటల్ రూపం తీసుకురావడం, విద్యతో పాటు నైపుణ్యం శిక్షణ వంటివి ప్రకటనలకే పరిమితం కాకుండా వాటిని అమలు చేయాలి. వేతన జీవులకు ఐటీ ట్యాక్స్ కొంత మినహాయింపు లభించినట్లే. రైతాంగంపై కూడా బడ్జెట్‌లో ఆశాజనకంగా ఉన్నట్టు ఉంది. రూ.12 లక్షల వరకు ట్యాక్స్ చెల్లించే అవసరం లేకుండా అమలు చేయడం మధ్యతరగతికి వరం.

- పాలబిందెల శ్రీనివాస్, సీపీఐ కార్యదర్శి

భాషా పుస్తకాలకు డిజిటల్ రూపం

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వ పాఠశాలలకు 50 వేల అటల్ టింకరింగ్ ల్యాబ్స్, భారతీయ భాషా పుస్తకాలకు డిజిటల్ రూపం తేవడం బాగుంది. దీనివల్ల రాబోయే తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది.

- అశోక్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు

రేపటి నుంచి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ

● **ఉప కమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డి**

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే వారికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఉప కమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డిలు తెలిపారు. గత సర్వేలో కొందరు దరఖాస్తు చేసుకోలేదనే సమాచారంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు.

ఈ నెల 3వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. అలాగే కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని నాలుగు డివిజన్లకు ఇన్‌చార్జిలను నియమించామని తెలిపారు. వార్డు కార్యాలయాల్లో ఆయా అధికారులను కలిసి కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని, ఏమైనా ఫిర్యాదులున్నా చేయవచ్చన్నారు. మరిన్ని వివరాలకు గాజులరామారం డివిజన్ ఇన్‌చార్జిగా ఏఎంసీ నర్సింగరావు 8978904128, జగద్గిరిగుట్ట డివిజన్ ఇన్‌చార్జి సునందిని 8008433878, చింతల్ డివిజన్ ఇన్‌చార్జిజవహర్‌లాల్ 9000994018, సూరారం ఇన్‌చార్జి హరిబాబు 9000994012 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

అదేవిధంగా రంగారెడ్డినగర్ ఇన్‌చార్జిగా హిమబిందు 7674831188, సుభాష్‌నగర్ ఇన్‌చార్జి కృష్ణ 8978901241, కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి గిరిబాబు 9989930220. జీడిమెట్ల ఇన్‌చార్జిగా కిషోర్ - 9700670026 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

కాలనీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కాలనీ అభివృద్ధికి అసోసియేషన్ సభ్యులు సమష్టిగా పని చేయాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాల్‌రెడ్డినగర్ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, బాపూనగర్ సుభానందేవి ముక్తేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బాల్‌రెడ్డినగర్ అధ్యక్షులు దుర్గారెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, సభ్యులు సుధాకర్‌రెడ్డి, లక్ష్మయ్య, లింగారెడ్డి, పెంటయ్య, సత్తిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, సుబ్బారావు, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నిజాంపేట్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్‌లోని మిథిలానగర్, ఆర్కే లే-అవుట్ విష్ణుప్రియ ఎన్‌క్లేవ్‌లో సీసీ రోడ్డులు, డ్రైనేజీ పనులకు నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. గతంలో ఈ లే-అవుట్‌లో డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. దీంతో ఆయన ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబును సంప్రదించి, సీసీ రోడ్డుకు రూ.12 లక్షలు, డ్రైనేజీకి నిర్మాణానికి రూ.63 లక్షలను మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కొంపల్లి సబ్-స్టేషన్ పరిధిలో 11కేవీ ఫీడర్ల దూలపల్లి ఎస్ఎస్, స్టీల్‌సిటీలోని చెట్టు కొమ్మలు తొలగించే కారణంగా నేడు విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 వరకు దూలపల్లి భారత్ పెట్రోల్‌బంక్ లైన్. అలాగే దక్కన్ కాంటా వెనుక, మసీదు రోడ్డు, అయ్యప్ప ఆలయం ఎదురుగా అశోక ఆల్‌మన్ ఫేజ్-2, ముఖేష్ సాయిదవా లైన్, చైనా టౌన్‌షిప్ లైన్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు సహ కరించాలని కోరారు.

షాపూర్‌నగర్‌లో

విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం వాటిల్లుతుందని ఏఈ ఈఎస్ఆర్ క్రిష్ణ తెలిపారు. రుద్రాలయ 11కేవి ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉత్తమ్ బిస్కెట్, జీడిమెట్ల ఫేజ్ 4లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, బేక్‌లైట్ హైలం ఫీడర్ పరిధిలోని 11కేవీ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 1.30 నుంచి 4.30 వరకు జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని ఫేజ్-3, 5లో విద్యుత్ సరఫరాలో అంతరాయం వాటిల్లుతుందని తెలిపారు. అంతరాయానికి చింతిస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.



గంజాయి తరలిస్తున్న నిందితులను పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

గంజాయి తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సూట్‌కేసులో ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారినుంచి 16.275 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఫయాజుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం ఒరిస్సా రాష్ట్రం, గంజా జిల్లా, కొత్తదీక్షిపల్లికి గ్రామానికి చెందిన కలగా కృష్ణమూర్తి(40), అదే జిల్లాకు చెందిన దిడవహాండీ గ్రామానికి చెందిన బద్దిరెడ్డి రవీందర్‌రెడ్డి(40)లు సుచిత్రా క్రాస్ రోడ్డు వద్ద సూట్‌కేసులో గంజాయి తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు కాపు కాసి అరెస్ట్ చేశారు. కేసును కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ కార్యాలయానికి బదిలీ చేస్తున్నట్టు తెలిపారు.

డబ్బులు తీసుకుని మోసం చేయడంతో మహిళ ఆత్మహత్య



లావణ్య(ఫైల్)

జీడిమెట్ల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): డబ్బులు తీసుకుని ఓ వ్యక్తి మోసం చేయడంతో మనస్తాపానికి గురైన గృహిణి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాలు ప్రకారం టీఎస్ఐఐసీ కాలనీ, గాయత్రి అపార్టుమెంట్‌లో నివాసముంటున్న చలిమేటి లావణ్య(35), చందు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. లావణ్య స్థానికంగా టైలరింగ్ షాపు నిర్వహిస్తోంది. తొమ్మిది నెలల క్రితం లావణ్యకు శివరాం అనే వ్యక్తితో పరిచయమైంది. భర్తకు తెలియకుండా ఆమె నగలు తాకట్టు పెట్టి 5లక్షల రూపాయలు శివరాంకు ఇచ్చింది. ఈ విషయం భర్తకు తెలియడంతో భార్యను నిలదీశాడు. డబ్బులు తిరిగి ఇవ్వాలని ఆమె అడగటంతో శివరాం మానసికంగా వేధింపులకు గురిచేయడం మొదలుపెట్టాడు.

గత నెల 31న వారిద్దరి మధ్య డబ్బుల విషయంలో గొడవ జరిగింది. మానసికంగా కృంగిపోయిన లావణ్య శనివారం 10.30కు ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. లావణ్య మరణానికి కారకుడైన శివరాంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని భర్త పోలీసులను ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని జీడిమెట్ల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు.

గంజాయి విక్రేత అరెస్టు

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఒడిస్సా నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి 1 కేజీ 675 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిస్సాకు చెందిన బిజైకుమార్ గాండ్(27) బతుకు దెరువు కోసం వలస వచ్చి గుండ్లపోచంపల్లిలోని కేవీరెడ్డినగర్‌లో నివసిస్తున్నాడు. అతడు బిగ్ బాస్కెట్ వెరోజ్‌లో కూలి పనులు చేస్తున్నాడు. గుండ్లపోచంపల్లి రైల్వేగేటు సమీపంలో గంజాయిని విక్రయిస్తున్నాడన్న సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ధర్మేష్ అతడిని పట్టుకొని విచారించారు. అతడి నుంచి 1 కేజీ 675 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

స్వామివారికి పట్టు వస్త్రాలు



పట్టు వస్త్రాలు తీసుకు వెళుతున్న మహిళలు

జీడిమెట్ల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి 54వ బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేశారు. స్వామివారి కల్యాణ మహోత్సవం 4వ తేదీన జరగనున్నది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పద్మశాలిసంఘం ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట సంజయ్‌పురి కాలనీ నుంచి కాలిబాటన కొండపైకి వెళ్లి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

మెప్మాపై సమావేశం

దుండిగల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ మెప్మాపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న యుగాంతర్ ఎస్‌జీఓ వారు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. కీ ప్యాడ్ ఫోన్ వినియోగించేవారు కూడా డిజిటల్ లావాదేవీలను ఏ విధంగా చేయాలనే వివరాలను తెలియచేశారు. సమావేశంలో భాగంగా ఇందిరా మహిళాశక్తిపై రివ్యూ నిర్వహించారు. ఈ సమావేశంలో తేజశ్విని, సీఓ మంజుల, మహిళా రిసోర్స్ పర్సన్స్ మహిళా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.